సాక్షి
పెద్దపల్లి

శనివారం । 29 । జూలై । 2023



కమాన్‌పూర్ ఠాణా తనిఖీ

కమాన్‌పూర్: కమాన్‌పూర్ ఠాణాను శుక్రవారం గోదావరిఖని ఏసీపీ తుల శ్రీనివాసరావు తనిఖీ చేశారు. అనంతరం గుండారం రిజర్వాయర్‌ను పరిశీలించారు.



'ఎల్లంపల్లి' సందర్శన

రామగుండం: ఎల్లంపల్లి ప్రాజెక్టును శుక్రవారం ఈఎన్‌సీ వెంకటేశ్వర్లు సందర్శించారు. కడెం, శ్రీరాంసాగర్ నుంచి వచ్చే వరద పరిస్థితులపై సంబంధిత అధికారులతో చర్చించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.0/25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం స్వల్పంగా ఉంది. ఈదురుగాలులు వేగంగా వీస్తాయి. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వాటర్‌ఫాల్స్, ప్రాజెక్టుల సందర్శనపై నిషేధం



రెమా రాజేశ్వరి, పోలీస్ కమిషనర్

గోదావరిఖని(రామగుండం): కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులు, డ్యామ్‌లు నిండుకుండలా మారాయని, ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని వాటి సందర్శనపై నిషేధం విధించినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి ప్రకటనలో తెలిపారు. పర్యాటక ప్రాంతాలకు ప్రజలు వెళ్లడానికి అనుమతి లేదన్నారు. ఆపదలో ఉంటే వెంటనే స్థానిక పోలీస్ అధికారులు లేదా డయల్ 100కి ఫోన్ చేసి సహాయం పొందాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో కల్వర్టులు, చిన్న చిన్న బ్రిడ్జిలపై నుంచి నీరు ప్రవహిస్తున్నప్పుడు కొంతమంది వాహనాలతో వరద నుంచి దాటేందుకు ప్రయత్నం చేస్తున్నారని, అట్టి చర్యలు ప్రాణాలకే ప్రమాదకరమన్నారు. ప్రజల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టులు, డ్యామ్‌ల పరిసరాలు, పర్యాటక ప్రాంతాలను తాత్కాలికంగా మూసివేశామని తెలిపారు.

నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలి



వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగర పాలక సంస్థ పరిధిలోని సప్తగిరికాలనీలో శుక్రవారం అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ పర్యటించారు. భారీ వర్షాలకు కాలనీలోని నాలాల ద్వారా సమీప ఇళ్లలో చేరిన వరద ప్రవాహం తీరును పరిశీలించారు. నగరపాలక సంస్థ ఎఫ్‌ఏసీ కమిషనర్ సుచరన్, డిప్యూటీ కమిషనర్ త్రయంబకేశ్వర్, డీఈ జమీల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్‌తోపాటు కాలనీవాసులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే మల్కాపూర్ శివారులో గోదావరినది ప్రవాహాన్ని పరిశీలించారు. బల్దియా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, వరద తీవ్రత వల్ల ఎలాంటి నష్టం జరుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పెద్దపల్లికి బెస్ట్ బస్టాండ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న నాగభూషణం

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రమైన పెద్దపల్లి బస్టాండ్ రాష్ట్రంలో బెస్ట్‌బస్టాండ్ అవార్డుకు ఎంపికైంది. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చేతుల మీదుగా అవార్డును గోదావరిఖని డిపో మేనేజర్ నాగభూషణం, పెద్దపల్లి స్టేషన్ మేనేజర్ కెఆర్‌రెడ్డి అందుకున్నారు. హైదరాబాద్–కరీంనగర్–రామగుండం ల మీదుగా వేసిన రాజీవ్‌రహదారిని ఆనుకుని ఉన్న పెద్దపల్లి మీదుగానే పొరుగు జిల్లాల బస్సులు కూడా రాకపోకలు సాగిస్తుంటాయి. దీనికి తోడు బస్టాండ్‌కు అతి సమీపంలో రైల్వే స్టేషన్ ఉండడంతో బస్టాండ్ మీదుగా నిత్యం దాదాపు వెయ్యి ట్రిప్పులను ఆర్టీసీ నడుపుతూ వేలాదిమంది ప్రయాణీకులను తమ గమ్య స్థానాలకు చేరవేస్తోంది.

గోదావరిఖని డిపో మేనేజర్‌కు..

గోదావరిఖనిటౌన్(రామగుండం): గోదావరిఖని ఆర్టీసీ డిపో మేనేజర్ నాగాభూషణంకు బెస్ట్ పర్ఫామెన్స్ అవార్డు దక్కింది. శుక్రవారం కరీంనగర్ ఆర్ఎం కార్యాలయంలో ఆర్ఎం సుచరిత, ఈడీ వినోద్‌కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

ఎల్లంపల్లికి తగ్గిన వరద ఉధృతి

రామగుండం: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో మూడు రోజులుగా ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి క్రమంగా వరద నీరు చేరింది. గురువారం వరద అత్యధికంగా 14 లక్షల క్యూసెక్కులకు చేరిన విషయం తెలిసిందే. శుక్రవారం వర్షం తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్టులోకి వరద సైతం తగ్గుతుంది. ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా ప్రస్తుతం 13.46 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. 6.44 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 47 గేట్లు ఎత్తి 6.94 లక్షల క్యూసెక్కులు ఔట్‌ఫ్లో చేస్తున్నారు.

వరద తగ్గింది.. బురద మిగిలింది



'ఈచిత్రంలో కనిపిస్తున్నది కాల్వశ్రీరాంపూర్ మండలంలో హుస్సేనిమియా వాగు వెంబడి సాగు చేస్తున్న పంట పొలాలు. వరద రావటంతో పంటనీట మునిగి ఇసుక మేటలు, రాళ్లతో నిండిపోయాయి. ప్రధానంగా ధర్మారం, పెద్దపల్లి, సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్, ఎలిగేడు, ముత్తారం, మంథని, ఓదెలా మండలాల్లో పెద్దఎత్తున పంట పొలాలు వరదకు దెబ్బతిన్నాయి. రోడ్లు ధ్వంసమైనాయి. అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టం వివరాలు సేకరిస్తుంది'.

- లోతట్టు ప్రాంతాల్లో ఎటు చూసినా మట్టిదిబ్బలు, చెత్తాచెదారమే
- పంట పొలాల్లో ఇసుకమేటలు, ధ్వంసమైన రహదారులు
- 4,970 ఎకరాల్లో వరి, 847 ఎకరాల్లో పత్తి పంట నష్టం



ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద నీటమునిగిన పంట పొలాలు

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలో పదిరోజులుగా కురుస్తున్న వర్షాలు తెచ్చిన నష్టం అంతా ఇంతా కాదు. ఎవరిని పలకరించినా కన్నీళ్లే కనిపిస్తున్నాయి. వరద చేసిన నష్టంతో కొన్ని కుటుంబాలు ఏళ్ల పాటు వెనకకు పోయాయి. జిల్లావాసులకు భారీ నష్టాన్ని మిగిల్చాయి. గోదారి, మానేరు, హుస్సేనిమియా వాగుల్లోకి భారీగా వరద చేరుతోంది. తీరప్రాంతాల్లో ఏ చేనులో చూసినా ఇసుకమేటలు, పెద్దపెద్ద రాళ్లు, విరిగిపడ్డ స్తంభాలు, తెగిపోయిన తీగలు, ధ్వంసమైన రహదారులు ఇలాంటి దృశ్యాలే కనిపిస్తున్నాయి. చెరువులు నిండుకుండలా మారి ప్రమాదం అంచున చేరడంతో ఎప్పుడు తెగుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రమాదకరంగా ఉన్న చెరువుల దిగువన ఉన్న గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వానాకాలం సాగుకు కలిసిరాలేదు. మొదట్లో వర్షం కురవక ఇబ్బందులుపడిన రైతులను ప్రస్తుతం భారీ వర్షాలు దెబ్బతీశాయి. పత్తి, వరి పంటల్లోకి నీరు చేరి, మరికొన్ని చోట్ల ఇసుక మేటలతో దెబ్బతిన్నాయి. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు వర్షం తెరిపినివ్వడంతో రైతులు తమ పంట పొలాలను బాగుచేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రభుత్వ సాయం పైనే ఆశలు పెట్టుకున్నారు.

గూడు చెదిరి..

వరదకు ఇళ్లలోకి నీరు చేరిన బాధితులు తమ గూడును చూసి బావురుమంటున్నారు. చెత్తాచెదారం, ముక్కుపుటాలదిరే దుర్వాసనతో పలువురి నివాసాలు కంపుకొడుతున్నాయి. విలువైన గృహోపకరణాలు, నిత్యావసర సామగ్రి పాడవడంతో బాధితులు దిక్కుతోచని స్థితిలో ఇబ్బందులు పడుతున్నారు. అలాగే 750 ట్రాన్స్‌ఫార్మర్లు, సుమారు 50 విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. 123 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

భయపెడుతున్న బ్యాక్ వాటర్?

జిల్లాలో వర్షం కురవడం ఆగినపోయినా గోదావరికి ఎగువన కురుస్తున్న వర్షాలకు తోడు కడెం, శ్రీరాంసాగర్ నీటిని దిగువకు వదులుతున్నారు. దీంతో గోదావరికి వరద ప్రవాహం తగ్గలేదు. దీంతో పరివాహక ప్రాంతవాసులు ఎప్పుడు ఏమి జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఇప్పటికే బ్యాక్‌వాటర్‌తో గోదావరిఖనిలోని మల్కాపూర్ హనుమాన్ టెంపుల్ మునిగిపోవడం, పార్వతీ బ్యారేజీకి భారీగా వరద చేరడంతో గతేడాదిలా మరోసారి వరద ముప్పు వాటిల్లుతుందని భావించారు. అయితే అధికారులు బ్యారేజీలను పూర్తిస్థాయిలో గేట్లు ఎత్తివేయడంతో ముప్పు తప్పినట్లయింది.

పరిహారం పైనే ఆశలు

జిల్లాలో 2,900 మంది రైతులకు చెందిన 4,970 ఎకరాల్లో వరి, 406 మంది రైతులకు చెందిన 847ఎకరాల్లో పత్తిపంట నష్టపోయినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. వాతావరణ లెక్కల ప్రకారం 33 అంతకన్నా ఎక్కువశాతం పంటనష్టం జరిగి ఉండాలి. 24గంటల్లో ఆ ప్రాంతంలో 20సెంటీమీటర్ల వర్షం కురిస్తే అత్యంత భారీ వర్షంగా పరిగణిస్తారు. కాగా ఇదే స్థాయిలో జిల్లాలో వర్షం కురవడంతో అధికారులు సర్వే చేసి పరిహారం అందించి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

తప్పిన ప్రమాదం

గతేడాది వరదలతో గోదావరిఖనిలో పలు కాలనీలు, మంథని పట్టణంతో పాటు పలు గ్రామాలు నీటమునిగాయి. అప్పు డు సుమారు 14లక్షల క్యూసెక్కుల వాటర్ ఎ ల్లంపల్లి నుంచి దిగువకు రాగా గోదావరి ఉధృతంగా ప్రవహించింది. అదే సమయంలో జిల్లాలో భారీగా కురిసిన వర్షం నీరు నదిలో కలవలేక, వెనక్కి వరద పొటెత్తింది. దీంతో ముప్పు వాటిల్లింది. అయితే ఈసారి గతం కంటే తక్కువగా 9.5లక్షల క్యూసెక్కుల వాటర్ దిగువకు రావటం, అదే సమయంలో వర్షం ఆగిపోవడంతో పెద్దఎత్తున ముప్పు జరగలేదు. కాగా గోదావరి బ్యాక్‌వాటర్‌తో గోదావరిఖనిలోని మల్కాపూర్, బొక్కలవాగు ఉధృతంగా ప్రవాహించడంతో మంథని–కాటారం ప్రధాన రహదారి, ఎక్లాసాపూర్ శివారు ప్రాంతంలో ఇరువైపులా నీరు చేరింది.

శాశ్వత పరిష్కారం చూపాలి



పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

మంథని: మంథనిని ఆనుకొని ప్రవహిస్తున్న బొక్కలవాగు వరద పట్టణంలోకి రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధికారులకు సూచించారు. శుక్రవారం నీటిపారుదల శాఖ ఈఈ బలరామయ్యతో కలిసి బొక్కలవాగు వరద ఉధృతిని పరిశీలించారు. అలాగే మంథని మండలం ఎక్లాస్‌పూర్, గోపాల్‌పూర్ గ్రామాల్లో పర్యటించారు. అనంతరం గోపాల్‌పూర్, చిన్న ఓదాల, పెద్దఓదాలలో మానేరువాగు వల్ల ఇసుక మేటలు వేసిన పొలాలను స్వయంగా ట్రాక్టర్ నడుపుకుంటూ వెళ్లి పరిశీలించారు. ఆయన వెంట కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ శశిభూషణ్ కాచే, మున్సిపల్ కౌన్సిలర్లు పెండ్రు రమాదేవి, హనుమంతరావు, నాయకులు ఉన్నారు.

అధైర్యపడవద్దు

మంథని: ప్రకృతి ఇబ్బంది పెట్టినా ప్రభుత్వం ఆదుకుంటుందని రైతులు, ప్రజలు అధైర్యపడవద్దని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. మానేరు ప్రవాహంతో దెబ్బతిన్న మంథని మండలం అడవిసోమన్‌పల్లి, నాగేపల్లి, చిన్నఓదాల గ్రామాల్లో శుక్రవారం పర్యటించి రైతులతో మాట్లాడారు. రైతులను ఆదుకునేలా తనవంతు కృషి చేస్తానని చెప్పారు.



పార్వతీ బ్యారేజీ చుట్టుపక్కల పొలాల్లో వరద



గుంజపడుగు సమీపంలో నీటమునిగిన పొలాలు



దెబ్బతిన్న పొలాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ మధు తదితరులు

మంథని డివిజన్‌లో..



బొక్కలవాగు ఉధృతికి మంథని- ఎక్లాస్‌పూర్ శివారులో నీట మునిగిన ట్రాన్స్‌ఫార్మర్



మంథని గోపాల్‌పూర్ మానేరు తీరంలో ఆనవాళ్లు కోల్పోయిన వరినారు



మంథని గోదావరి తీరంలో పత్తి చేనులో వరద

మంథని: భారీ వర్షాలు, గోదావరి, మానేరు, బొక్కలవాగు వరదతో భారీ నష్టం వాటిల్లింది. మంథని డివిజన్‌లోని రైతులు మరోమారు అతలాకుతలమయ్యారు. మానేరు ఉధృతికి మంథని మండలం చిన్నఓదాల, గోపాల్‌పూర్, అడవిసోమన్‌పల్లి, నాగేపల్లి, ముత్తారం మండలం ఖమ్మంపల్లి, సీతంపేట, ఓడేడు, శ్రీరాంపూర్ తదితర గ్రామాల్లో పంట పొలాల్లో వేసిన వరినార్లు ఆనవాళ్లు లేకుండా పోయాయి. గోదావరి తీరం మంథని, రామగిరి మండలాల్లోని సుందిళ్ల, సిరిపురం, గుంజపడుగు, విలోచవరం, పోతారం, ఖానాపూర్, ఖాన్‌సాయిపేట, అమ్మగారిపల్లి, ఆరెంద, వెంకటాపూర్, మల్లారం గ్రామాల్లోని పొలాలు వరదలో మునిగాయి. డివిజన్ వ్యాప్తంగా 2వేలకు పైగా ఎకరాల్లో పత్తి, 3వేల ఎకరాల్లో వరి నార్లకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. గోదావరి, మానేరు, బొక్కలవాగు పరివాహక ప్రాంతాల్లో 300 ట్రాన్స్‌ఫార్మర్లు నీటిలో మునిగినట్లు విద్యుత్ శాఖ అధికారులు అంచనా వేవారు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ విలువ రూ.40 వేలు ఉంటుంది. ఈ లెక్కన పది కోట్లకు పైగానే నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది.

పార్వతీ బ్యారేజీ సందర్శన

మంథని: మంథని మండలం సిరిపురం సమీపంలోని పార్వతీ బ్యారేజీని శుక్రవారం జిల్లా ప్రత్యేక అధికారి డాక్టర్ ఎస్.సంగీత సత్యనారాయణ, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సందర్శించారు. బ్యారేజీ వరద ఉధృతి వివరాలు తెలుసుకున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదను పరిశీలిస్తూ అనుగుణంగా దిగువ ప్రాంతాలను అలర్ట్ చేయాలని సూచించారు. ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు, ఎస్ఈ కరుణాకర్, ఈఈ ఓంకార్‌సింగ్, డీఈ లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

రోడ్డెక్కిన గోదావరి, బొక్కలవాగు వరద

మంథని మండలం పార్వతీ బ్యారేజీ నుంచి 9 లక్షల క్యూసెక్కుల నీరు గోదావరిలోకి వదలడంతో వరద ఉధృతి పెరిగింది. దీంతో బొక్కలవాగు వరద ముందుకు వెళ్లక పెరిగిపోయింది. ఈక్రమంలో మంథని వద్ద గోదావరి సుమారు 150 మీటర్లు ముందుకు వచ్చింది. స్నానఘట్టాలు, శివలింగం, గౌతమేశ్వర ఆలయం దాటి ఎస్ఎల్‌బీ గార్డెన్ వద్ద రోడ్డుపై ప్రవహించింది. వాగులోని చెక్‌డ్యాం పూర్తిగా మునిగి వంతెనకు సమీపంలో ప్రవహించింది. వరద ఉధృతికి వందలాది ఎకరాల పొలాలు మునిగిపోయాయి. మంథని పట్టణంలోకి సైతం బొక్కలవాగు బ్యాక్ వాటర్ మురుగు కాల్వల ద్వారా చేరింది. సాయంత్రం వరకు కాస్త తగ్గడంతో ప్రజలకు కాస్త ఊరట లభించింది.



పార్వతీ బ్యారేజీని పరిశీలిస్తున్న జిల్లా ప్రత్యేక అధికారి సంగీత సత్యనారాయణ, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఆందోళన అవసరం లేదు

గోదావరిలో వరద ఉధృతి తగ్గుముఖం పట్టిందని మంథని ప్రాంత ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం మంథనిలోని బొక్కలవాగు ఉధృతిని పరిశీలించారు. ఎల్‌మడుగు సమీపంలో వరద ప్రవాహం వెళ్లకుండా గుట్టలు అడ్డుగా ఉన్నాయని దీంతో బొక్కలవాగుకు బ్యాక్ వాటర్ వస్తుందన్నారు. ఆయన వెంట ఈఈ బలరాం, డీఈ రమేశ్‌బాబు, ఏఈ రఫీ ఉన్నారు.

ముంపు గ్రామాలకు విద్యుత్ పునరుద్ధరణ

వరదలు పూర్తిగా తగ్గితేనే నష్టం పూర్తిస్థాయిలో అంచనాకు వస్తుందని విద్యుత్ శాఖ ఎస్ఈ సుదర్శన్ తెలిపారు. శుక్రవారం మంథనిలోని సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష అనంతరం మాట్లాడారు. జిల్లాలో 626 టాన్స్‌ఫార్మర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేశామని, మరో 256 నీటిలోనే మునిగి ఉన్నాయని చెప్పారు. భారీ వర్షాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిన గ్రామాలకు సరఫరా పునరుద్ధరించినట్లు తెలిపారు. డీఈ శివరాం, ఏఈ మల్లయ్య, తదితరులు ఉన్నారు.

కాల్వశ్రీరాంపూర్‌లో..

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండలంలోని కిష్టంపేట, మొట్లపల్లి, పెదరాతుపల్లి, చిన్నరాతుపల్లి, జాఫర్‌ఖాన్‌పేట, వెన్నంపల్లి గ్రామాల్లో పంటపొలాల్లో ఇసుకమేటలు వేశాయి. ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ తిరుపతిరెడ్డి, ఆర్ఎస్ఎస్ మండల కన్వీనర్ దేవయ్య, ఏవో నా గరాజు, ఏఈవోలు రమేశ్‌రాజు, పూర్ణచందర్, శ్రీని వాసరెడ్డి, సర్పంచులు దెబ్బతిన్న పొలాలను పరిశీలించారు. నష్టం వివరాలు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ద్వారా ప్రభుత్వానికి తెలియజేసి రైతులకు పరిహారం అందిచాలని కోరుతామని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు.



కిష్టంపేటలో దెబ్బతిన్న పొలాలను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

1,286 టీఎంసీలు గంగపాలు

- ఇప్పటి వరకు సముద్రంలోకి విడుదల చేసిన నీరు
- వరద ఉధృతి నేపథ్యంలో తప్పని విడుదల
- భారీ వరదలనూ తట్టుకునేలా ప్రాజెక్టులు
- ఎల్లంపల్లి, ఎంఎల్‌డీ, మిడ్‌మానేరుకు లక్షల క్యూసెక్కుల వరద
- ఫలించిన ముందస్తు చర్యలు, ఉమ్మడి జిల్లాలో ఒకేమరణం



ఎల్లంపల్లి వద్ద గోదావరి పరవళ్లు

ఏడాదికాలంలో వదిలిన టీఎంసీలు	
ఎల్లంపల్లి:	1,182 టీఎంసీలు
మిడ్‌మానేరు:	56 టీఎంసీలు
ఎల్ఎండీ:	48.5 టీఎంసీలు
మొత్తం:	1,286టీఎంసీలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ చూడని భారీ వర్షాలు ఉమ్మడి జిల్లాను అతలాకుతలం చేశాయి. గోదావరి, మానేరు పొంగిపొర్లాయి. వాటిపై నిర్మించిన ప్రాజెక్టులు నిండుకుండల్లా మారాయి. వర్షం ఆగినా ఎగువ నుంచి వస్తున్న వరద వచ్చింది వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు. ఏడాదికాలంలో దాదాపు 1200 టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్లిందని గణాంకాలు చెబుతున్నాయి. వాస్తవానికి ఉమ్మడి జిల్లాలో ఉన్న మధ్య మానేరు, దిగువ మానేరు, ఎల్లంపల్లి వీటితోపాటు ఎగువమానేరు మరికొన్ని ప్రధాన చెరువుల్లో నీరు నిలువ ఉంటుంది. ఈ నాలుగు ప్రాజెక్టుల్లో కలిపి 51 టీఎంసీల మేరకు నీరు నిలువ ఉంచుకునే వీలుంది. కానీ, రెండేళ్లుగా కురుస్తోన్న భారీ వర్షాలతో పరిమితికి మించి వరద వస్తోంది. రెండేళ్లకాలంలో ఏకంగా లక్షల క్యూసెక్కుల వరద రావడం, అంతే స్థాయిలో విడుదల చేయడం ఏటేటా పెరుగుతోంది.

మన ప్రాజెక్టులు గట్టివి..

ఉమ్మడి జిల్లాలో గురువారం కురిసిన వర్షం కనీవినీ ఎరుగనిది. కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం మల్యాల గ్రామంలో ఏకంగా 38 సెం.మీల వర్షం కురవడం సరికొత్త రికార్డు. సిరిసిల్ల, జగిత్యాల,పెద్దపల్లిలో పల్లెలు చిగురుటాకులా వణికాయి. మంథని, ధర్మపురి, సిరిసిల్ల పట్టణం, జమ్మికుంటలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. ఎగువ, దిగువ మానేరు ప్రాజెక్టులతోపాటు, ఎల్లంపల్లికి భారీగా వరద నీరు వచ్చింది. ముఖ్యంగా కడెం ప్రాజెక్టు, ఎస్సారెస్పీ, ఎగువన కురిసినవర్షాలతో ఎల్లంపల్లికి వరద పోటెత్తింది. కడెం ప్రాజెక్టు మీదుగా వరద ప్రవహించడంతో మన ప్రాజెక్టులు ఎంత వరద తట్టుకుంటాయి ? అన్న ప్రశ్న అందరిలోనూ మొదలైంది. దీనికి అధికారులు తమ సమాధానంతో భరోసా ఇచ్చారు. ఎల్ఎండీ ప్రాజెక్టుకు 5 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా.. తట్టుకోగలదని, అదే మిడ్‌మానేరు ప్రాజెక్టు 5.08 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకోగలదని ఎస్సారెస్పీ అధికారులు వెల్లడించారు. మరోవైపు గోదావరి నదిపై నిర్మించిన ఎల్లంపల్లి సామర్థ్యం ఈ రెండు ప్రాజెక్టుల కన్నా అత్యధికం.. ఇది ఏకంగా 19.5 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకుని నిలబడగలదని అధికారులు స్పష్టంచేశారు. ఆ స్థాయిలో వరదలు వచ్చే అవకాశాలు దాదాపుగా లేవని కూడా తెలిపారు. ఏ రకంగా చూసినా.. మన ప్రాజెక్టులు క్షేమంగా నీటితో నిండుకుండలా కళకళలాడుతున్నాయని వివరించారు.

ఒక మరణం.. పంటనష్టం సర్వే..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కలెక్టర్లు, సీపీలు,ఎస్పీలు చేపట్టిన ముందు జాగ్రత్త చర్యలు మంచి ఫలితాలు ఇచ్చాయి. కోరుట్లలో బాత్రూం గోడ కూలి వివాహిత మరణం మినహా ఉమ్మడి జిల్లాలో ఎక్కడా మరణాలు, గల్లంతులు చోటుచేసుకోలేదు. మంథనిలో ఇసుక రీచ్‌లో చిక్కుకుపోయిన వారిని పోలీసులు రక్షించిన సంగతి తెలిసిందే. పలు చోట్ల డీఆర్ఎఫ్ టీంలు మోహరించడం, తెగిపోయిన రోడ్ల వద్ద బందోబస్తు పెట్టడంతో చాలా వరకు ప్రాణనష్టం నివారించగలిగారు. వర్షం తెరిపినిచ్చిన దరిమిలా వ్యవసాయ అధికారులు శనివారం నుంచి సర్వే ప్రారంభించనున్నారు.

ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టుల వివరాలు

ప్రాజెక్టు	ఎఫ్‌టీఎల్ (మీటర్లలో)	సామర్థ్యం (టీఎంసీలు)	నిల్వ (టీఎంసీలు)	ఇన్‌ఫ్లో/ఔట్ ఫ్లో	తెరిచిన గేట్లు
ఎల్లంపల్లి	145.45/+148	20.17	13.46	6,44,871/6,94,482	47
మిడ్‌మానేరు	313.92/318	27.5	18.19	60,667/48514	06
ఎల్ఎండీ	917.40/920	24,03	21.82	33239/56296	16

ప్రజలకు ఇబ్బందులు రానీయొద్దు

- టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, ప్రత్యేకాధికారి

పెద్దపల్లిరూరల్: వరుస వర్షాలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, జిల్లా ప్రత్యేక అధికారి డాక్టర్ సంగీత సత్యనారాయణ కోరారు. శుక్రవారం జిల్లాలోని అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఎప్పటికప్పుడు లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఎల్లంపల్లి, పార్వతి బ్యారేజీ, సరస్వతి బ్యారేజీ ప్రాజెక్టుల్లోకి భారీగా వరద చేరిందని, వరద పరిస్థితిపై గంటకోసారి సమీక్ష చేయాలని, ఆకస్మికంగా వరద పెరిగితే చేపట్టాల్సిన పనులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించి అవసరమైన మందులు అందించాలని సూచించారు. ముంపునకు గురయ్యే అవకాశమున్న ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి అవసరమైన వసతులు కల్పించాలన్నారు. కాన్ఫరెన్స్‌లో అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, జీవీ శ్యాంప్రసాద్‌లాల్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

సుల్తానాబాద్(పెద్దపల్లి): వివేకానంద విదేశీ విద్యా పథకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శ్రీ వైష్ణవ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కాండూరి వాసు తెలిపారు. ఈనెల 23 నుంచి వచ్చే నెల 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అలాగే ఆర్థిక సహాయం పథకం కోసం అర్హులైన బ్రాహ్మణ-శ్రీవైష్ణవ పారిశ్రామికవేత్తల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'ఆదివాసులకు క్షమాపణ చెప్పాలి'

సుల్తానాబాద్(పెద్దపల్లి) : మణిపూర్ ఆదివాసి మహిళను నగ్నంగా ఊరేగించడమే కాకుండా సామూహిక అత్యాచారం చేసి కిరాతకంగా హత్యచేసిన ఘటనకు కారకులైన ప్రధాని నరేంద్రమోడీ, హోం మంత్రి అమిత్ షా, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్, మణిపూర్ సీఎం బీరేన్‌సింగ్ రాజీనామా చేసి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని జేఎండబ్ల్యూపీ డివిజన్ కమిటీ మావోయిస్టు పార్టీ కార్యదర్శి వెంకటేశ్ ప్రకటనలో అన్నారు. 2017లో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచే ప్రజలపై దాడులు పెరిగాయని, మణిపూర్‌లో హింసను అదుపులోకి తీసుకురావడంలో సీఎం వైఫల్యం చెందారన్నారు. ఇప్పటివరకు 17 పైగా చర్చిలు దహనం చేయడమే కాకుండా 12 పోలీస్‌స్టేషన్లో చొరబడి 1,241 ఆయుధాలు ఎత్తుకొని పోయారని సీఎం బీరేన్‌సింగ్ మీడియా ముందు నిస్సిగ్గుగా చెప్పారని అన్నారు. రెండువర్గాల మధ్య 80 రోజులకు పైగా ఘర్షణ జరుగుతూ ఆస్తి, ప్రాణనష్టాలు జరుగుతున్నా ప్రధాని విదేశీయాత్రలు చేస్తున్నారని, హోం మంత్రి రాష్ట్రంలో పర్యటించి మీడియాను కంట్రోల్‌చేసి, ఇంటర్నెట్ బంద్ చేయించారని విమర్శించారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న హింసకాండ, ఊచకోతలు, అత్యాచారాలపై ప్రజాసంఘాలు, ప్రజాస్వామ్య, మానవ హక్కుల సంఘాలు, ప్రగతిశీల మేధావులు ముక్తకంఠంతో ఖండించాలన్నారు.

ముంపులోనే శ్మశానవాటికలు



వరద నీటిలో శ్మశానవాటికలు

రామగుండం: గోదావరి పరివాహక గ్రామాలకు చెందిన హిందూ శ్మశానవాటికలు నది ఒడ్డున నిర్మించిన విషయం తెలిసిందే. కాగా ఏటా గోదావరికి వరద ఉధృతి చేరడంతో శ్మశానవాటికలు ముంపునకు గురవుతున్నాయి. గోదావరి ఒడ్డున ఉన్న శివాలయం కనిపించకుండా ముంపులోనే ఉంది. ఇందులో గోలివాడ, విలేజి అంతర్గాం, లింగాపూర్, మద్దిర్యాల, పాట్యాల గ్రామాల శ్మశాన వాటికలున్నాయి. ఇదిలా ఉండగా వీటిని నిర్మించినప్పటి నుంచి ఒకట్రెండు మినహా దహన సంస్కారాలు కూడా ప్రారంభించని వాటికలు కూడా ఉన్నాయి. వీటిని నిర్మించిన కాంట్రాక్టర్లకు ఇంకా బిల్లులు రాకపోవడం గమనార్హం.

స్వగ్రామానికి వలసజీవి మృతదేహం

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం అనంతారం గ్రామానికి చెందిన గుర్రం మహేశ్ (30) అనే యువకుడు ఇరవై రోజుల క్రితం సౌదీ అరేబియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా శుక్రవారం మృతదేహం స్వగ్రామానికి చేరింది. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అంత్యక్రియల్లో పాల్గొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

సింగరేణికి దొంగల బెడద



దొంగలు కాపర్ తీసుకొని పొదల్లో పడేసిన రబ్బర్



చోరీకి గురైన కాపర్ వైర్‌ను పట్టుకున్న సిబ్బంది

- చోరీకి గురవుతున్న కాపర్ వైర్
- సంస్థకు రూ.లక్షల్లో నష్టం

'ఏకంగా స్టోర్స్‌కే కన్నం వేసి 600 మీటర్ల కాపర్ కేబుల్‌ను దొంగల ముఠా చాకచక్యంగా కొట్టేసింది. కొత్త రీల్‌కు ఉన్న 35 స్క్వేర్ ఎంఎం కేబుల్‌ను ఎత్తుకెళ్లి, సమీపంలోని ముళ్లపొదల్లో కాపర్ వైర్‌ను తీసుకొని, పై రబ్బర్‌ను అక్కడే పడేసి వెళ్లారు. ఈ ఘటనలో సింగరేణికి రూ.12 లక్షల నష్టం జరిగింది. ఈ సంఘటనను అధికారులు గోప్యంగా ఉంచి, శాఖాపరమైన విచారణకు ఆదేశించారు.' ఇలాంటి ఘటనలు ఇటీవల కాలంలో పెరిగాయి.

గోదావరిఖని: సింగరేణి రామగుండం రీజియన్ ఆర్జీ-1, 2, 3 ఏరియాల్లోని ఓసీపీల్లో ఉన్న కాపర్ కేబుళ్లే లక్ష్యంగా దొంగల ముఠాలు రెచ్చిపోతున్నాయి. గతంలో స్క్రాప్ యార్డులపై కన్నేసిన దొంగలు అందినకాడికి ఎత్తుకెళ్లి, అక్రమ మార్గాన విక్రయించి, సొమ్ము చేసుకునేవారు. చోరీలను నివారించేందుకు యాజమాన్యం స్క్రాప్ యార్డులు, గనుల వద్ద సెక్యూరిటీ పెంచడంతోపాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింది. స్క్రాప్ నిల్వలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు విక్రయాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటోంది. దీంతో ఈ చోరీలు తగ్గిపోయాయి. అంతేకాకుండా స్క్రాప్ చోరీలవల్ల ప్రయాస ఎక్కువగా ఉండటం, లాభాలు కూడా తక్కువగా ఉండటంతో దొంగలు తమ రూట్ మార్చారు. తక్కువ శ్రమతో ఎక్కువ లాభాలు వచ్చే కాపర్ కేబుళ్లపై కన్నేశారు.

భారీ యంత్రాల పవర్ కేబుళ్లు చోరీ

వర్షాకాలం కావడంతో ఓసీపీ క్వారీలోని పనిస్థలాల వద్దకు సెక్యూరిటీ సిబ్బంది, సింగరేణి అధికారులు వెళ్లే అవకాశాలు తక్కువ. ఇదు అదనుగా దొంగలు రెచ్చిపోతున్నారు. విద్యుత్‌తో నడిచే భారీ యంత్రాలకు ఉన్న పెద్ద కాపర్ కేబుళ్లను కట్ చేసుకొని, ఎత్తుకెళ్తున్నారు. కొన్ని సందర్భాల్లో హెచ్‌టీ లైన్ విద్యుత్ సరఫరా ఉండగానే పెద్ద గొడ్డళ్లతో కేబుళ్లను నరికి, క్షణాల్లో వాహనంలో వేసుకొని, పరారవుతున్నారు. దీనివల్ల సంస్థకు ఆర్థికంగా నష్టంతోపాటు యంత్రానికి విద్యుత్ లేక పని నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతోంది.

ఇంటి దొంగల అండతోనే!

ఇంటి దొంగల అండతో కాపర్ కేబుళ్ల చోరీ ముఠాలు రెచ్చిపోతున్నాయన్న ప్రచారం జరుగుతోంది. ఎంతో కొంత ముట్టజెప్పి, చోరీ సమయంలో సహకరించాలని కోరడంతో కొందరు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ క్రమంలోనే స్టోర్స్‌లోని 600 మీటర్ల కాపర్ కేబుల్ దొంగతనం జరిగిందని పలువురు అంటున్నారు. దీనిపై కొందరికి సస్పెండ్ కమ్ పెండింగ్ ఎంక్వైరీ పెట్టి, విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

దొరికినా చర్యలు లేవు

దొంగతనాలు జరిగిన కొన్ని సందర్భాల్లో దొంగలు రెడ్‌హ్యాండెడ్‌గా సెక్యూరిటీ సిబ్బందికి దొరికినా సరైన చర్యలు లేకపోవడంతో ముఠాలు రెచ్చిపోతున్నాయనే ప్రచారం జరుగుతోంది. సింగరేణి సంస్థకు, పోలీసు శాఖకు మధ్య సరైన సమన్వయం లేక దొంగలు తిరిగి అదే పనికి అలవాటు పడుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. స్క్రాప్, కాపర్ కేబుళ్ల ముఠాల వివరాలు, విషయాలు తెలిసినప్పటికీ కఠిన చర్యలు తీసుకోవడంలో వెనుకంజ వేయడంతో సింగరేణిలో చోరీలకు అడ్డుకట్ట పడటం లేదన్న ఆరోపణలున్నాయి.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్

సుల్తానాబాద్(పెద్దపల్లి): స్థానిక సంస్థల అధికారులు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ అన్నారు. శుక్రవారం సుల్తానాబాద్ పట్టణంలో వరద పరిస్థితిపై అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం పలు కాలనీలను సందర్శించారు. ఎల్ఎండీ 16 గేట్లు తెరగడంతో మానేరువాగు పరిస్థితిపై ఆరా తీశారు. మానేరు పరిసర ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని సూచించారు. తెగిన రంగయ్య కుంట ప్రతిపాదనలను ఇరిగేషన్ అధికారి ప్రవీణ్‌రాజా సిద్ధం చేసి కలెక్టర్‌కు పంపించారు. కార్యక్రమంలో తహసీల్దార్ యాకన్న, మేనేజర్ అలీముద్దీన్, పెద్దపల్లి కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

తాగునీటి ఇబ్బందులపై ఆరా

మండలంలోని గట్టెపల్లి మానేరు వాగు నుంచి సుల్తానాబాద్ మున్సిపల్‌కు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. శుక్రవారం మానేరువాగులో పైప్ లైన్ పరిస్థితిని పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ప్రత్యేక అధికారి డాక్టర్ సంగీత ఆదేశాల మేరకు మానేరును పరిశీలించినట్లు ఆయన తెలిపారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా సౌకర్యాలు ఏర్పాటు చేయాలని మేనేజర్ అలీముద్దీన్‌ను కోరారు.

హామీలతో మోసగిస్తున్న కేసీఆర్

- మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి



మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

పెద్దపల్లిరూరల్: తెలంగాణలోని ఇళ్లు లేని నిరుపేదలకు నియోజకవర్గానికి ఏడాదికి వెయ్యి డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇస్తామన్న సీఎం కేసీఆర్ ఇప్పటికీ నియోజకవర్గంలో ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. పెద్దపల్లిలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కాశిపేట లింగయ్య, నాయకుడు కౌశికహరితో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హామీలతో ప్రజలను మోసగించడం సీఎం కేసీఆర్‌కే చెల్లుతుందన్నారు. నియోజకవర్గంతో పాటు జిల్లాలోని రామగుండం, మంథని నియోజకవర్గాల్లో చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించేందుకు ఆగస్టు 2న పార్టీ నాయకులు, శ్రేణులతో కలిసి వెళ్తామని ప్రకటించారు.

కేంద్రం ఇచ్చిన నిధులేవీ..

ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద కేంద్రం ఇళ్ల నిర్మాణాల కోసం ఇచ్చిన నిధులను సీఎం కేసీఆర్ దారి మళ్లించారని మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అన్నారు. రాష్ట్రానికి 2.5 లక్షల ఇళ్లను మంజూరు చేసి నిధులు కేటాయించినా వాటిని దుర్వినియోగం చేశారన్నారు. ఆగస్టు 2న డబుల్‌బెడ్‌రూం ఇళ్ల సందర్శన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. నాయకులు మీస అర్జున్‌రావు, ఠాకూర్ రాంసింగ్, కాసర్ల జనార్దన్ రెడ్డి, జంగ చక్రధర్ రెడ్డి, ఫహీం, సదానందం, రాజు, రమేశ్, మల్లారెడ్డి, మంథెన కృష్ణ, ఓదెలు తదితరులున్నారు.

మహిళా సాధికారతకు స్వశక్తి సంఘాలు దోహదం

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఎమ్మెల్యే, మేయర్, తదితరులు

కోల్‌సిటీ(రామగుండం): మహిళల సాధికారతకు స్వశక్తి మహిళా సంఘాలు దోహదపడుతాయని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కొనియాడారు. శుక్రవారం రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ, మున్సిపల్ కమిషనర్ సుచరణ్ పర్యవేక్షణలో జిల్లా సహకార అధికారి శ్రీనివాస్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు, మెప్మా పీడీ(అర్బన్), డీఎంసీ రజనీ ఆధ్వర్యంలో రామగుండం పట్టణ సమాఖ్య ఎన్నికలు నిర్వహించారు. స్వశక్తి సంఘాల స్లమ్ లెవెల్ ఫెడరేషన్ ప్రతినిధులు పాల్గొని నూతన కార్యావర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షురాలిగా నూనె లతామోహన్, ఉపాధ్యక్షురాలిగా వెంగళ పద్మలత, ప్రధాన కార్యదర్శి షాహీదా బాను, సంయుక్త కార్యదర్శి సట్టు పరిపూర్ణ, కోశాధికారి ఆరెల్లి తిరుమల, కార్యవర్గ సభ్యులుగా బండ సరిత, తాటిపాముల రాజ్యలక్ష్మి, పెండ్యాల లక్ష్మి, ముత్యం శ్రీలత ఎన్నికయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశానికి నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, ఎమ్మెల్యే చందర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే అభినందించారు. డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు మొక్క బహూకరణ

కోల్‌సిటీ: అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అరుణశ్రీ శుక్రవారం రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు.

డివైడర్‌ను ఢీకొని నలుగురికి గాయాలు



నుజ్జునుజ్జయిన కారు

సుల్తానాబాద్ రూరల్: సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని రాజీవ్ రహదారిపై గురువారం రాత్రి ప్రమాదవశాత్తు కారు డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గోదావరిఖనికి చెందిన ఇర్ఫాన్, హజార్, మెయిన్, అవినాష్ కారులో కరీంనగర్‌కు తిరిగి వస్తుండగా రాజీవ్ రహదారిపై ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి



కొమురమ్మ (ఫైల్)

గోదావరిఖని: రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతిచెందిన సంఘటన గోదావరిఖనిలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామగుండంలోని విద్యుత్‌నగర్‌కు చెందిన వెల్పుల్ల వెంకటస్వామి – కొమురమ్మ (55) దంపతులు శుక్రవారం మంథనిలో జరిగే దశదిన కర్మకు వెళ్తుండగా స్థానిక గంగానగర్‌లో రోడ్డు క్రాస్ చేస్తుండగా ద్విచక్రవాహనాన్ని వెనుకనుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కొమురమ్మ తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందింది. వెంకటస్వామి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మానవత్వం చాటుకున్న సీఐ

రోడ్డు ప్రమాదంలో వీరు గాయపడి ఆస్పత్రికి తరలించేందుకు ఎవరూ ముందుకురాకపోవడంతో వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు హుటాహుటిన అక్కడకి చేరుకొని తీవ్రగాయాలైన కొమురమ్మను పోలీస్ వాహనంలో గోదావరిఖని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు కూతుళ్ల, కుమారుడు ఉన్నారు.

ధరూర్ గ్రామ శివారులో మరో యువకుడు..

జగిత్యాలక్రైం: జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామ శివారులోని బైపాస్‌రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే... ధరూర్ గ్రామానికి చెందిన అంతడుపుల నవీన్ (24) మినరల్ వాటర్ ప్లాంట్‌లో పనిచేస్తాడు. శుక్రవారం సాయంత్రం నర్సింగాపూర్‌లో పని నిమిత్తం ద్విచక్రవాహనంపై వెళ్లి తిరిగి ధరూర్ వస్తుండగా బైపాస్‌రోడ్డులో ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొంది. దీంతో నవీన్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య అఖిల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సుధాకర్ తెలిపారు. మృతుడికి నాలుగు నెలల చిన్నారి ఉంది. అందరితో కలివిడిగా ఉండే నవీన్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

బొగ్గుబాయి

మట్టి తొలగింపు లక్ష్యం సాధించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జీఎం సుధాకర్‌రావు

కమాన్‌పూర్ (మంథని): ఆర్జీ-3 డివిజన్‌లోని ఓసీపీ-2లో మట్టి తొలగింపు (ఓబీ), నియమ నిబంధనలపై డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ అధికారి వెంకటేశ్వరరెడ్డి శుక్రవారం ఆర్జీ- 3 అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మట్టి తొలగింపులోని నియమ నిబంధనల వివరాలను ఆర్జీ-3 కె.సుధాకర్‌రావు వివరించారు. డైరెక్టర్ మాట్లాడుతూ నియమాలను అనుసరిస్తూ నిర్దేశించిన మట్టి తొలగింపు లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు రాధాకృష్ణ, రాజేందర్, జైనుల్లా బద్దీన్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలగకుండా చూడాలి

- సింగరేణి సంస్థ మార్కెటింగ్ జీఎం సూర్యనారాయణ



ఓసీపీ-2 గనిని పరిశీలిస్తున్న మార్కెంటింగ్ జీఎం సూర్యనారాయణ

కమాన్‌పూర్: ఆర్జీ-3 డివిజన్‌లోని ఓసీపీ-2 ఉపరితల గనిని సింగరేణి సంస్థ మార్కెంటింగ్ జీఎం కే. సూర్యనారాయణ శుక్రవారం సందర్శించారు. భారీ వర్షాలతో ఓసీపీలో నిలిచిన నీటిని తోడుతున్న పంపులు, వ్యూపాయింట్‌ను పరిశీలించారు. ఓసీపీలో వర్షపునీరు నిల్వకుండా తగిన చర్యలు తీసుకోవాలని బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలుగకుండా చూడాలని అధికారులను అదేశించారు. జీఎం వెంట ఎస్‌వోటు జీఎం రఘుపతి, ఎస్‌వోఎం మార్కెటింగ్ సుందర్ రాజు, మేనేజర్ రామారావు, తదితరులున్నారు.

కాంట్రాక్టు కార్మికులకు అండగా ఉంటాం

- డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్



కాంట్రాక్టు కార్మికులతో మాట్లాడుతున్న ఎంఎస్ రాజ్‌ఠాగూర్

గోదావరిఖని: కాంట్రాక్టు కార్మికుల అండగా ఉంటామని డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్ స్పష్టంచేశారు. శుక్రవారం జీడీకే-5 ఓసీపీ ఓబీ కాంట్రాక్టు కార్మికులతో మాట్లాడారు. పీసీ పటేల్ కంపెనీ కాంట్రాక్ట్ కార్మికులు పడుతున్న ఇబ్బందులు డిమాండ్లను సాధించేంత వరకు పోరాడుతామన్నారు. వెంటనే కార్మికుల సమస్యలు, డిమాండ్లు పరిష్కరించాలన్నారు. సమావేశంలో నాయకులు మహంకాళి స్వామి, చుక్కల శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నజీముద్దీన్, విజయ్, శివ, చంటి, ప్రవీణ్ అజయ్, సురేశ్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

గైర్హాజర్ ఉద్యోగులకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న మేనేజర్ రవికిరణ్

గోదావరిఖని: విధులకు గైర్హాజరైన ఉద్యోగులకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆర్జీ-2 ఏరియా వకీల్‌పల్లి గనిలో జరిగిన కౌన్సెలింగ్‌లో అధికారులు వారి సమస్యలు తెలుసుకున్నారు. గైర్హాజర్‌తో కుటుంబం ఆర్థికంగా నష్టపోతుందన్నారు. ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కంపెనీ నిబంధనల ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని, సమస్యలుంటే యాజమాన్యం పరంగా సహకరిస్తామన్నారు. కౌన్సెలింగ్‌కు 22 మంది వారి కుటుంబ సభ్యులతో హాజరై వారి సమస్యలు విన్నవించారు. ఇక ముందు గైర్హాజరు లేకుండా విధులకు హాజరవుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గని మేనేజర్ రవికిరణ్, గ్రూప్ ఇంజినీర్ చంద్రశేఖర్, సంక్షేమాధికారి ఓంకారిబాబు, ఫిట్ సెక్రటరీ మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మస్టర్ల కోసమే సేఫ్టీ కమిటీలు



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ-2 ఏరియాలోని సేఫ్టీ కమిటీలు ఉచిత మస్టర్లకే పరిమితమయ్యాయని ఏఐటీయూసీ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు ఎల్ ప్రకాశ్, బ్రాంచ్ కార్యదర్శి రాజరత్నం ఆరోపించారు. శుక్రవారం ఆర్జీ-2 ఏరియా యైటింక్లయిన్ కాలనీలోని ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. టీబీజీకేఎస్ గుర్తింపు సంఘం ఓసీపీ-3 సీహెచ్‌పీలో గుట్టుచప్పుడు కాకుండా, కనీసం బైలాస్ పాటించకుండా సేఫ్టీ కమిటీలు వేస్తున్నారన్నారు. కార్మికుల సమస్యలను పరగణలోకి తీసుకోకుండా, పని ప్రదేశాల్లో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో తెలుసుకోకుండా, సేఫ్టీ కమిటీలు నిర్వహించడం విడ్డూరంగా ఉందన్నారు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి విధానాలు పునరావృతం కాకుండా సింగరేణి యాజమాన్యం చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అన్నారావు, శ్యాంసన్, బుర్ర తిరుపతి, సాంబశివరావు, రవీందర్, రవికుమార్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఓబీ టెండర్లపై వీడియో కాన్ఫరెన్స్



మాట్లాడుతున్న ఆర్జీ-1 జీఎం శ్రీనివాస్

గోదావరిఖని: ఓబీ టెండర్లలో అనుసరించాల్సిన విధానంపై ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ జి.వెంకటేశ్వర్ రెడ్డి చర్చించారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ఏరియాల జీఎంలతో మాట్లాడారు. నూతన టెండర్లలో పొందుపర్చాల్సిన నిబంధనలపై చర్చించారు. నూతనంగా ఓబీ టెండర్లను ఆహ్వానించేటప్పుడు ఓవర్ బర్డెన్ ఎన్ఐటీ (నోటీస్ ఇన్వైటింగ్ టెండర్) ఆర్డర్‌కు సంబంధించి పొందుపర్చాల్సిన నిబంధనలు, అంశాల గురించి సమీక్షించారు. టెండర్లలో ఉండాల్సిన అంశాలపై దిశా నిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్, ఫైనాన్స్ ఏజీఎం రామకృష్ణ, ఐఈడీ ఏజీఎం ఆంజనేయులు, సర్వే అధికారి ప్రభాకర్, మేనేజర్ అనిల్ గబాలే తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పిల్లలకు ఉద్యోగాలేవి ?

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సీతారామయ్య



మాట్లాడుతున్న సీతారామయ్య

గోదావరిఖని: మారుపేరుతో పనిచేస్తున్న 300మంది కార్మికుల పిల్లలకు ఉద్యోగాలివ్వకుండా యాజమాన్యం పెండింగ్‌లో పెట్టిందని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య ఆరోపించారు. శుక్రవారం జీడీకే-2వ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణిలో పదేళ్లుగా గుర్తింపు సంఘంగా ఉన్న టీబీజీకేఎస్ యూనియన్ వైఫల్యం వల్లే సింగరేణిలో మారుపేర్లతో కార్మికుల పిల్లల ఉద్యోగాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 2017లో సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా యూనియన్ గెలుపు కోసం సీఎం కేసీఆర్ సింగరేణిలో మారుపేర్లతో పనిచేస్తున్న కార్మికులకు సొంతపేర్లుగా మారుస్తామని హామీ ఇచ్చారని, ఇంతవరకు హామీని అమలు చేయలేదన్నారు. మెడికల్ కళాశాల కోసం రూ.500 కోట్లు, భద్రాచలం వరద బాధితులకు రూ.1000 కోట్లు ఇచ్చిన యాజమాన్యం సంస్థ లాభాల్లో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికుల తాగునీటి కోసం కోసం రూ.20 కోట్లు వెచ్చించేందుకు ముందుకురావడం లేదన్నారు. దాదాపు 600 మంది డిపెండెంట్‌లు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సీఎం కేసీఆర్ హామీ మేరకు సింగరేణిలో కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏఐటీయూసీ కేంద్ర మహాసభల అనంతరం సింగరేణి వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. 16వ మహాసభలు ఆగస్టు 25 నుంచి 27 వరకు గోదావరిఖనిలో నిర్వహిస్తున్నామని, జయప్రదం చేయాలని ఆయన కార్మికులను కోరారు. నాయకులు రంగు శ్రీనివాస్, మాదన మహేశ్, ఎస్.వెంకట్‌రెడ్డి, బుర్ర భాస్కర్, మిట్ట శంకర్, పర్లపెల్లి రామస్వామి, ఎల్.రమేశ్, పొన్నాల వెంకటయ్య, శ్రీధర్, పెద్దెల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.